క్లుప్తంగా

పార్టీ అధినేత జగన్‌ను కలిసిన నాగిరెడ్డి



జగన్ మోహన్‌రెడ్డితో నాగిరెడ్డి, దేవన్‌రెడ్డి తదితరులు

గాజువాక: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మంగళవారం కలిశారు. తన కుమారుడు దేవన్‌రెడ్డి, మనవడు బెవిన్‌రెడ్డితో కలిసి తాడేపల్లిలో తమ నేతను కలిసిన ఆయన గాజువాకలో తాజా పరిస్థితులపై కొద్దిసేపు ముచ్చటించారు. వారితో పాటు వైఎస్సార్ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి జీలకర్ర నాగేంద్ర ఉన్నారు.

కల్వర్టు పనుల పరిశీలన



కల్వర్టు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న స్టాలిన్

గాజువాక: చినగంట్యాడ వందడుగుల రోడ్‌లో నిర్మిస్తున్న కల్వర్టు పనులను 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ మంగళవారం పరిశీలించారు. కల్వర్టు నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వార్డులో రోడ్లు, డ్రైన్లు, పార్కుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మానసిక దివ్యాంగ బాలలకు క్రీడల్లో శిక్షణ



ఆటల్లో పాల్గొన్న విద్యార్థులు

గాజువాక: మానసిక దివ్యాంగ విద్యార్థులకు గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం ఆటలలో శిక్షణ ఇచ్చారు. ప్రేరణ కార్యక్రమంలో భాగంగా సమగ్ర శిక్ష అభియాన్, స్పెషల్ ఒలింపిక్స్ భారత్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులతో బాసీగేమ్, వాలీబాల్ ఆడించారు. కార్యక్రమంలో స్పెషల్ ఒలింపిక్స్ భారత్ డైరెక్టర్ రాజశేఖర్, ఎంఈవోలు విశ్వనాథం, సునీత, హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి, సమన్వయకర్త గీత, ఏపీవో అప్పల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక యోగా నేడు

అగనంపూడి: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అగనంపూడిలోని బ్రహ్మకుమారీస్ సంస్థ దివ్య జ్యోతి భవనంలో ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్టు దివ్యజ్యోతి భవనం ఇన్‌చార్జి బీకే రామకోటి తెలిపారు. బుధవారం తెల్లవారుజామున ఐదు గంటల నుంచి యోగా, ప్రాణాయామం, యోగాసనాలు, ధ్యానం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. మానసిక ప్రశాంతత కోసం కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

ఎమ్మెల్యేకు వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులను నివారించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని స్టీల్ సీఐటీయూ నాయకులు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కోరారు. నాయకులు మంగళవారం పల్లాను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న గనులను రెన్యువల్ చేయాలని కోరారు. ఈ అంశాన్ని కేంద్రమంత్రికి వివరించి దానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎన్.రామారావు, జె.అయోధ్య రామ్, యు.రామస్వామి, పి.శ్రీనివాసరాజు కె.గంగాధర్ తదితరులున్నారు.

అంతటా ఆధ్యాత్మిక సౌరభం

అగనంపూడి శాంతినగర్‌లో కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, అక్కిరెడ్డిపాలెంలో తిరుమలేశుని బ్రహ్మోత్సవాలతో పాటు శ్రీనగర్ దిబ్బపాలెంలో పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా అంతటా ఆధ్యాత్మిక సౌరభం వెల్లివిరిసింది. ప్రత్యేక అలంకరణల్లో స్వామి వార్లు, అమ్మవారు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీవారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.



అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి



విశేష పుష్పాలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి

అగనంపూడి: కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. జీవీఎంసీ 79వ వార్డు పాత అగనంపూడి శాంతినగర్ కాలనీలోని ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి దంపతులు, భక్తులు పాల్గొని ఉత్సవమూర్తులకు కల్యాణం జరిపించారు. ముందుగా స్వామి వారిని నూతన వస్త్రాలతో అలంకరింపజేసి, దర్శనాలు కల్పించారు. వారం రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, అగనంపూడి పరిసర నిర్వాసిత కాలనీల నుంచి భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండుగ

గాజువాక: స్థానిక దిబ్బపాలెం పునరావాస కాలనీలో పైడితల్లి అమ్మవారి పండగ మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి అనుపోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే అమ్మవారికి విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అమ్మవారి వేషధారణ, తప్పెటగుళ్లు, కోలాటాలు, సాముగరిడీలు, మెగా డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం భక్తులను ఆకట్టుకున్నాయి. భారీ బాణాసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ముగిసిన శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో కొలువైయున్న తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ప్రథమ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం విశేష పూజలు, హోమాలతో ముగిశాయి. వేకువ జామునే తిరుమలేశునికి సుప్రభాతం, అర్చనలతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అలంకరణల అనంతరం భక్తులకుస్వామి వారి దర్శనం కలిగించారు. బాలాజీకి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అగ్ని ధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, ఉక్త హోమం, స్వామి వారి మూల మంత్ర హోమం నిర్వహించారు. మహా పూర్ణాహుతిలో ఎస్టీబీఎల్ చైర్మన్ గుత్తికొండ బాలాజీ దంపతులు పాల్గొన్నారు. బలిహరణ, వసంతోత్సవం, శ్రీవారి స్నపన తిరుమంజనం, శ్రీవారి చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ప్రతినిధులు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు



స్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు



పూర్ణాహుతి సమర్పిస్తున్న ఎస్టీబీఎల్ చైర్మన్ బాలాజీ దంపతులు

వాసవీ క్లబ్ సేవలు ప్రశంసనీయం

పెదగంట్యాడ: సామాజిక సేవే ధ్యేయంగా వాసవీ క్లబ్‌లు పని చేస్తున్నాయని వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ అన్నారు. విశాఖ జిల్లా పర్యటనలో భాగంగా పెదగంట్యాడ మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి, అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా గాజువాక శ్రామికనగర్ ఎంపీపీ పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే పెదగంట్యాడ గ్రామం బోర్డుతో పాటు ఆలయంలో లాకర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్లబ్‌ల పనితీరు, సేవా కార్యక్రమాలను గురించి తెలుసుకునేందుకు పర్యటనలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అడ్డగళ్ల వేవే గుప్తా, కమలశ్రీ, సాయి నిర్మల, ఉమామహేశ్వరి, కట్టా సతీష్, కేసారపు నాగేశ్వరరావు, వాసవీ క్లబ్, వనిత క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రవిచంద్రన్ తదితరులు

వైభవంగా దుర్గాదేవి ఉత్సవం



దుర్గాదేవిని దర్శించుకుంటున్న కరణంరెడ్డి తదితరులు

గాజువాక: స్థానిక 76వ వార్డు గోపాలరెడ్డి నగర్ గ్రామదేవత దుర్గాదేవి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు దంపతులు తొలిపూజ చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. 35 ఏళ్ల క్రితం తమ పొలంలో స్వయంభూగా దుర్గాదేవి వెలసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా గోపాలరెడ్డి నగర్ నివాసులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. చీర, సారె సమర్పించి, కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కమిటీ పెద్దలు సోములు, వెంకటరావు, గంగాధర్, నాయుడు, నరేష్, సాహితి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

పల్లాకు విమల విద్యాలయం ఉపాధ్యాయుల వినతి

ఉక్కునగరం: గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఉక్కునగరం విశాఖ విమల విద్యాలయం ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసిన వారు తమ సమస్యలను వివరించారు. గత 40 ఏళ్లుగా ఉన్న పాఠశాల ఇటీవల మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ అంశంపై స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, పాఠశాల యాజమాన్యంతో చర్చించి తమకు న్యాయం చేయాలని కోరారు. 70 మంది బోధన, బోధనేతర సిబ్బందితో పాటు సుమారు 2 వేల మంది విద్యార్థుల భవిష్యత్తుపై ఆధారపడి ఉన్న పాఠశాల పాత పద్ధతిలో నడిచేలా సహకరించాలని కోరారు. దీనిపై పల్లా సానుకూలంగా స్పందించారని ఉపాధ్యాయులు తెలిపారు.



ఎమ్మెల్యే పల్లాకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఉక్కు అధికారి మరణంపై సీఎం, హోంమంత్రికి ఫిర్యాదు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ అధికారి, తన భర్త నాత్ర తాతారావు మరణంపై వాస్తవాలు వెలుగులోకి తేవాలని మృతుని భార్య బంగారమ్మ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి టి.జి.భరత్, చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్‌లకు ఫిర్యాదు చేశారు. తన భర్త మృతి విషయంలో యాజమాన్యం ద్వంద్వవైఖరి అవలంబిస్తుండడంతో తమ కుటుంబానికి తీరని నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. 2017లో ఏప్రిల్ 11న డ్యూటీకి వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని పేర్కొన్నారు. తరువాత ప్లాంట్ ఆవరణలో మృతి చెంది ఉండడంతో యాజమాన్యం కూడా ప్రమాదవశాత్తు మరణించారని అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. తరువాత ఏమైందో, యాజమాన్యం మాట మార్చి కర్మాగారం ఆవరణలో మృతి చెందలేదని బుకాయిస్తూ తమ కుటుంబానికి తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై గతంలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తే రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు వాటిపై చర్యల నిమిత్తం పంపించారని, అప్పట్లో ప్రభుత్వ అధికారులు కూడా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం హయాంలోనైనా తన కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉక్కు కార్మికులకు తక్షణం వేతనాలు చెల్లించాలి

- అఖిలపక్ష నాయకుల డిమాండ్
- ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా



ధర్నాలో ప్రసంగిస్తున్న స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు తక్షణం వేతనాలు చెల్లించాలని ఉక్కు అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ కూడలి వద్ద ధర్నా చేశారు. వేతనాల జాప్యాన్ని నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం ఉత్పత్తి, సేల్స్ జరుగుతున్నా కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదన్నారు. కొన్ని నెలలుగా జీతాల కోసం ఆందోళన చేసేలా యాజమాన్యం ప్రవర్తిస్తోందన్నారు. 18వ తేదీ వచ్చినా జీతాలు చెల్లించకపోతే కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. జీతాలు ఆఖరి ప్రాధాన్యతగా భావించే యాజమాన్యం వైఖరి దుర్మార్గమన్నారు. దీనిపై యాజమాన్యాన్ని నిలదీయాల్సి ఉందన్నారు.

ముందుగా సగం వేతనాలు

ఉక్కు యాజమాన్యంతో అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో మంగళవారం సాయంత్రం సగం వేతనాలు ఇస్తామని సీఎండీ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. మిగిలిన సగం బుధవారం సాయంత్రం వేస్తామన్నారని తెలియజేశారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, జె. అయోధ్యరామ్, ఎన్.రామారావు, యు. రామస్వామి, జి. గణపతి రెడ్డి, రామ్మోహన్‌కుమార్, మహాలక్ష్మినాయుడు, బి. డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్య ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ

గాజువాక: విద్య ఆవశ్యకతను తెలియజేస్తూ గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ఏపీ సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయ భాస్కర్, జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ ప్రారంభించారు. డీఈవో చంద్రకళ మాట్లాడుతూ వచ్చేనెల 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు సునీత, విశ్వనాథం, పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయ ప్రశాంతి, సమగ్ర శిక్ష అభియాన్ అధికారి బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఆర్జేడీ విజయ భాస్కర్, డీఈవో చంద్రకళ తదితరులు

'ఉక్కు'ను ఆదుకుంటాం

ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

అగనంపూడి: విశాఖ ఉక్కును ఐక్యంగా పరిరక్షించుకుందామని గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద రిలే దీక్షా శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఉక్కు ఉద్యోగులు, నిర్వాసితులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని గర్భాం మాంగనీస్ గనులు, కింతాడ క్వార్ట్జ్ గనులు, సారిపల్లి ఇసుక రీచ్‌లను ఈ నెలాఖరు నాటికి విశాఖ ఉక్కుకు కేటాయింపులు చేస్తామన్నారు. ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోలేని పక్షంలో తనకు ఏ పదవైనా తృణప్రాయమే అవుతుందన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా భావితరాలకు అందించేందుకు కృషి చేస్తానన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీలోగా ఉక్కు యాజమాన్యంతో చర్చించి సమగ్ర ప్రణాళికను రూపొందించి కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత, పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ, విళ్లా రామ్మోహన్‌కుమార్, అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, గణపతిరెడ్డి, యు.రామస్వామి, గంగవరం గోపా, ప్రసాద్, కార్పొరేటర్లు బొండా జగన్, మొల్లి ముత్యాలు, పల్లా శ్రీను, పులి రమణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

సమస్యలు పరిష్కరించాలని ఏఎన్ఎంల ధర్నా

మహారాణిపేట : వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఏఎన్ఎంలు ఆందోళనకు దిగారు. సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఏఎన్ఎంలు నినాదాలు చేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న నాయకులతో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు చర్చలు జరిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ఆందోళన విరమించాలని యూనియన్ నాయకులను డీఎంహెచ్‌వో కోరారు. అయినా ఏఎన్ఎంలు ఆందోళన కొనసాగించారు. బీసీజీ వ్యాక్సినేషన్‌ను రెండు రోజుల నుంచి తగ్గించాలని, యూనిఫారాల అలవెన్స్ ఇవ్వాలని, సెలవుల్లో కోత విధించరాదని, సచివాలయ ఏఎన్ఎంలపై పని ఒత్తిడి తగ్గించంచాలని, సెలవుల్లో కూడా విధులు నిర్వహించవలసి వస్తుందని నాయకురాలు మణి తెలిపారు. అధికారుల ఒత్తిడి అధికంగా ఉందంటూ ఆందోళన కొనసాగించారు.



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

పైడితల్లమ్మా.. చల్లగ చూడమ్మా

అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పండగ కనులపండువగా నిర్వహించారు. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు.



పైడితల్లి అమ్మవారు



అంజలి రథోత్సవంలో పాల్గొన్న భక్తజన సందోహం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఏడు గ్రామాల ఆరాధ్య దేవతగా విరాజిల్లుతున్న అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామస్తులు, మహిళలు కొత్తవీధిలోని అమ్మవారి ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. పసుపు కుంకుమ, చీరలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పళ్లు, వడ పప్పు, చలిమిడి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి సింహాచలం దేవస్థానం తరపున ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించారు. అలాగే గాంధీనగర్‌లో ఉన్న శతకంపట్టు వద్ద ఉన్న పైడితల్లి అమ్మవారి ఘటాల గుడి వద్ద కూడా భక్తులు, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి పండగను పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం అధికారులు ఆలయాన్ని, అమ్మవారిని పూలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద క్యూలు, టెంట్లు, షామియానాలు, మంచినీరు ఏర్పాటు చేశారు. ఉచిత ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం సెక్యూరిటీ గార్డులను, పోలీసులను బందోబస్తుగా ఏర్పాటు చేశారు. అలాగే అడవివరం వీధుల్లో పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. గోపాలపట్నం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా అనుపు మహోత్సవం..

అమ్మవారి అనుపు మహోత్సవాన్ని పండగ సందర్భంగా మంగళవారం రాత్రి గ్రామ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గాంధీనగర్‌లోని శతకం పట్టు నుంచి అమ్మవారి ఘటాలు, గరగలను పూజారి వంశీయులైన లండ కుటుంబీకులు, గ్రామస్తులు, మహిళలు శిరస్సుపై పెట్టుకుని కొత్తవీధిలో ఉన్న ఆలయం వరకు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఘటాలకు దారి పొడవునా మహిళలు, భక్తులు హారతులిచ్చారు. ఘటాలను శిరస్సుపై ఉంచుకుని పలువురు గ్రామస్తులు మొక్కు తీర్చుకున్నారు. అంతకు ముందు ఉదయం గాంధీనగర్‌లోని అమ్మవారి సతకంపట్టు వద్ద అంజలి రథోత్సవ సేవ నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున ఉత్సవంలో పాల్గొన్నారు. భక్తులతో సతకంపట్టు ఏరియా అంతా కిక్కిరిసిపోయింది. పలువురు భక్తులు నూతన ఘటాలను శిరస్సుపై పెట్టుకుని వచ్చి అమ్మవారికి మొక్కుబడిగా సమర్పించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు..

అనుపు మహోత్సవంలో సింహాచలం దేవస్థానం ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పులి వేషాలు, కాంతారా డ్యాన్స్, కేరళ డ్రమ్స్‌తో కళాకారులు ఆకట్టుకున్నారు.